సాక్షి కరీంనగర్

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



న్యూస్‌రీల్

పంద్రాగస్టుకు ముస్తాబు



ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానం

కరీంనగర్ అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవానికి పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలని ఇప్పటికే కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించగా... అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐటీ, పరిశ్రమల, వాణిజ్యశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పతాకావిష్కరణ చేస్తారు. 9.32 గంటలకు వందన స్వీకారం, 9.40కి సందేశం, 10 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులకు సత్కారం, 10.10కు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.40కు ప్రశంసపత్రాలు, మెమొంటోల ప్రదానం, 11.10 గంటలకు స్టాళ్ల పరిశీలన, 11.40కు అస్త్రా కన్వెన్షన్ హాల్‌లో తేనీటి విందు ఉంటుంది.

కానిస్టేబుళ్లకు ముగిసిన శిక్షణ



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై దశలవారీగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. గురువారం రెండో బ్యాచ్ శిక్షణ ముగిసిందన్నారు. కమిషనరేట్ కేంద్రంలోని ఐటీ కోర్ కార్యాలయంలో ఉపయోగించే వివిధ సాఫ్ట్‌వేర్లు, అప్లికేషన్లు, సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. నేరాల ఛేదనలో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఏసీపీలు జి.విజయ్ కుమార్, వేణుగోపాల్, సీఐలు తిరుపతి, సరిలాల్, శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీనివాస్, తిరుమల్ ఉన్నారు.

కరీంనగర్ పోలీసుల లోగో మార్పు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త లోగోను ప్రతిపాదిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన లోగో రూపకల్పనను సీపీ గౌస్ ఆలం ప్రతిపాదించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ భద్రత, శాంతిభద్రతల సంరక్షణలో నిబద్ధతను సూచించేలా ఈ లోగోను రూపొందించారు. ఈ లోగోలో హూ డేర్స్ విన్స్ అనే పదం ఉంటుంది, ఇది ధైర్యం చేసేవాడు గెలుస్తాడు అని తెలుపుతుంది. లోగోలో కనిపించే అశోక చక్రం, నాలుగు సింహాల చిహ్నం దేశభక్తిని, శక్తిని, ప్రజల్లో నిబద్ధతను ప్రతిబింబిస్తాయని సీపీ వెల్లడించారు.

'సహకారం' మరో ఆరు నెలలు!

- సహకార సంఘాలకు ఇక పాత చైర్మన్లే
- గడువు పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

కరీంనగర్ అర్బన్: ఎట్టకేలకు సహకార సంఘాల పదవీ కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గురువారంతో పాలకమండళ్ల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలలు పదవీ కాలాన్ని పొడిగించడం ఇప్పట్లో ఎన్నికలు ఉండవని స్పష్టమవుతోంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్, డీసీసీబీ ఉమ్మడి జిల్లాలో 135 సంఘాలున్నాయి. ఇప్పటికే ఆరు నెలలు పదవీ కాలం పొడిగించగా తాజాగా మరో ఆరు నెలలు పొడిగించడం గమనార్హం. ఇక శుక్రవారం జరిగే పంద్రాగస్టు వేడుకల్లో చైర్మన్లే పతాకావిష్కరణ చేయనున్నారు.

విపత్తు సాయంగా జిల్లాకు రూ.కోటి


కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వరద సహాయక చర్యల కోసం జిల్లాకు ముందస్తుగా రూ.కోటి విడుదల చేసింది. ఈ నెల 17 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాలో కంట్రోల్ రూంతో పాటు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసింది. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వరదల సమయంలో ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు చర్యలు చేపట్టేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని జిల్లా ఉన్నతాధికారులు వివరించారు.

మా భూమి.. మా దేశం.. మా ప్రాంతం.. మా సొత్తు.. మా మనుషులు నినాదంతో ఎందరో మహనీయుల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్య భారతదేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఉద్యమ సమయం నాటి అనేక సంఘటనలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి వేదికైన మెట్‌పల్లి ఖాదీప్రతిష్టాన్ విదేశీ వస్తు బహిష్కరణలో కీలక పాత్ర పోషించింది. తాజాగా పొలిటికల్ బ్రాండ్‌గా పేరొందుతోంది. ఉమ్మడి జిల్లానుంచి ఎందరో మహనీయులు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. అమరులైన వారి పేరిట శిలాఫలకాలు ఆయా ప్రాంతాల్లో దర్శనమిస్తున్నాయి. నాటికీ.. నేటికీ పరిస్థితులు మారాయి. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అయినప్పటికీ విద్య, వైద్యం, చట్టాలపై మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందని నేటి యువత అంటోంది. 2047 నాటికి వందేళ్ల భారతదేశాన్ని పునర్నిర్మిస్తామని సగర్వంగా చెబుతోంది. నేడు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా..

సగర్వంగా.. స్వాతంత్ర్యంగా

- స్వాతంత్ర్య ఉద్యమంలో ఉమ్మడి జిల్లా గుర్తులు
- పోరాటానికి వేదికైన ఖాదీ ప్రతిష్టాన్
- దేశం కోసం పోరాడిన మహనీయులు
- 2047 నాటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన యువత
- నేటి పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

(నేడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గడిచిన 78ఏళ్లలో, ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, పరిస్థితులపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 100 మందిని పలుకరించగా.. వెల్లడించిన అభిప్రాయాలు ఇలా..)



ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య? | స్వేచ్ఛా, సమానత్వం ఎక్కడైనా కనిపిస్తున్నాయా? | స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కాలంటే నిజాయితీగా పని చేయాల్సిన రంగం?

పొలిటికల్ బ్రాండ్.. మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్



మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్

కోరుట్ల/మెట్‌పల్లి: ఇక్కడి నేతలకు ఖాదీ బట్టలే స్ఫూర్తి. చాలా మందికి ఖాదీ రాజకీయంగా ఊపిరి పోసిందంటే అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్య పోరాటకాలంలో ఖాదీ ఉద్యమానికి వేదికగా నిలిచింది జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి. గాంధీ శిష్యుడు అన్నాసాహెబ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో వెలిసిన ఖాదీ ప్రతిష్టాన్ ఖద్దరు ఆ కాలంలో ఖ్యాతి పొందింది. అప్పటి ఆనవాయితీని పుణికిపుచ్చుకుని మెట్‌పల్లి ప్రాంత రాజకీయ నాయకులు ఖాదీ వస్త్రాలు ధరించడం ఇప్పటికీ దూరం కాలేదు. కడక్ ఖాదీ బట్టలతో ఎవరైనా కనిపిస్తే చాలు ఈయన మెట్‌పల్లి లీడరని చెప్పొచ్చు. 1983లో ఎన్టీఆర్ ప్రభుత్వ హయంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన వర్ధినేని వెంకటేశ్వర్‌రావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ కేవీ.రాజేశ్వర్‌రావు, జనతా పార్టీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా ఎన్నికైన కొమొరెడ్డి రామ్‌లు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఖాదీ ప్రతిష్టాన్ వస్త్రాలు ధరించి రాజకీయాల్లో కీలకంగా ఎదిగిన వారే. 2009 అసెంబ్లీ పునర్విభజనలో కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంగా మారినప్పటికీ.. మెట్‌పల్లి ఖాదీ కార్ఖానా స్ఫూర్తిగా రాజకీయాల్లోకి వచ్చిన నేతలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సంజయ్ ఇక్కడి ఎమ్మెల్యేలుగా కొనసాగడం గమనార్హం.

మొదటి జెండా ఎగిరింది ధర్మపురిలోనే..

ధర్మపురి: నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి, స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపు పొందిన జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన కేవీ.కేశవులు, మాణిక్యశాస్త్రి ప్రాణస్నేహితులు. కేశవులు ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగల్‌రావు హయాంలో చేనేత జౌళిశాఖ మంత్రిగా కొనసాగారు. 1947లో ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు ధర్మపురిలోని గోదావరి ఒడ్డునున్న కర్నెఅక్కెపెల్లి భవనంపై తన మిత్రుడైన మాణిక్యశాస్త్రితో కలిసి మొట్టమొదటి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా ఎగురవేయడం నిషేధమని అప్పటి నిజాం ప్రభుత్వం కేశవులను బంధించడానికి ప్రయత్నించగా.. నిండుగా ప్రవహిస్తున్న గోదావరిలోంచి వెళ్లి తప్పించుకున్నారు. ఏడాదిపాటు ముంబయిలో తలదాచుకున్నారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినం రోజు తిరిగి ధర్మపురికి చేరుకున్నారు. 2019 జనవరి 30న అనారోగ్యంతో మృతి చెందారు.



కేవీ కేశవులు, మాణిక్యశాస్త్రి (ఫైల్)

పోరాటాల 'గాలిపల్లి'

ఇల్లంతకుంట: పోరాటాల గ్రామంగా చరిత్రలో నిలిచిపోయింది రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. నిజాంపాలిత ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రానికి ఇంకా విముక్తి లభించలేదు. బద్దం ఎల్లారెడ్డి ప్రాంతమైన గాలిపల్లి ప్రజలు నైజాం పాలనపై తిరగబడ్డారు. 1948 సెప్టెంబర్ మొదటి వారంలో రజాకార్లు గాలిపల్లికి వచ్చారు. తిరుగుబాటుదారులు వారిసైన్యంపై రాళ్లు విసిరారు. రజాకార్ల కాల్పుల్లో తిరుగుబాటుదారుల్లో ముందువరుసలో ఉన్న 11మంది చనిపోయారు. వీరిలో గాలిపల్లికి చెందిన వారు ఏడుగురు, బేగంపేట, సోమారంపేట, తాళ్లపల్లి, నర్సక్కపేట గ్రామాలకు చెందినవారు నలుగురు ఉన్నారు. రజాకార్ల పాలన నుంచి విముక్తి కలిగిన తరువాత గాలిపల్లిలో దాదాపు 20మందికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్రీడంఫైటర్ పింఛన్లు మంజూరు చేశాయి.



స్వాతంత్ర్య పోరాటంలో వీరమరణం పొందిన 11 మంది శిలాఫలకం



సాక్షి టాక్ షోలో పాల్గొన్న కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు

కఠిన చట్టాలు.. బలమైన సైన్యం

సాక్షి టాక్ షో

- ఆ దిశగా దేశాన్ని పునర్నిర్మిస్తాం
- డ్రగ్స్ భూతాన్ని మట్టి కరిపిస్తేనే మనుగడ
- చదవు, కొలువుల్లో తారతమ్యాలు ఉండొద్దు
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సాక్షి' టాక్ షోలో పాల్గొన్న యువత

కరీంనగర్‌క్రైం/హుజూరాబాద్: 'కఠిన చట్టాలు తీసుకొచ్చి, బలమైన సైన్యాన్ని సిద్ధం చేసుకుంటాం. నవ భారత నిర్మాణానికి నాంది పలికి, దేశాన్ని పునర్‌నిర్మిస్తాం' అంటూ నేటి యువత ప్రతిజ్ఞ పూనుతున్నారు. ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలంటే సైన్యాన్ని మరింత పటిష్టం చేయాలని, విద్యా, సాంకేతిక రంగాల్లో మార్పులు అవసరమని చెబుతున్నారు. డ్రగ్స్ ముప్పును మట్టికరిపించకపోతే మనవజాతి మనుగడ కష్టతరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చట్టపరమైన వ్యవస్థ పటిష్టంగా పని చేయాలని కోరుకుంటున్నారు. శుక్రవారం పంద్రాగస్టు సందర్భంగా 2047 నాటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతదేశం ఎలా ఉండాలనే అంశంపై కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ,పీజీ కళాశాల, హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన టాక్‌షోలో విద్యార్థులు పాల్గొని, తమ అభిప్రాయాలు వెల్లడించారు.

చదువుల్లో రిజర్వేషన్లు వద్దు



దేశవ్యాప్తంగా చదువుల్లో, కొలువుల్లో రిజర్వేషన్లు తీసివేయాలి. ప్రతిభ ఆధారంగా విద్యాసంస్థల్లో సీట్లు, చదువు పూర్తయిన తరువాత ఉద్యోగాలు ఇచ్చేలా వ్యవస్థ ఉండాలి. మిగితా విషయాల్లో పథకాలు ఎలా ఉన్నా, చదువుల్లో అర్హతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– అన్నపూర్ణ, బీఎస్సీ, ఆదిలాబాద్

రాజకీయాల్లో ప్రాధాన్యమివ్వాలి



రాజకీయాల్లో మహిళలు, అందులో యువతకు ఎక్కువగా ప్రాధాన్యం ఉండాలి. ఇప్పటికీ మహిళలు గెలిచిన స్థానాల్లోవారి కుటుంబసభ్యుల్లోని మగవారే పెత్తనం చెలాయిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. మహిళల స్థానాల్లో వారే పరిపాలించేలా చూడాలి.

– అర్చన, బీకాం, వీణవంక

చట్టాలు మార్చాలి



భారతీయ చట్టాలకు ఇంకా పదును పెట్టాలి. మహిళలపై నేరాల్లో విదేశాల్లో కఠిన శిక్షలు ఉన్నట్లే మన దేశంలోనూ అమలు చేయాలి. ఇలా చేస్తే నేరం చేసే ఆలోచన కూడా రాదు. శిక్షలు కూడా త్వరగా పడేలా న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ పనిచేయాలి.

– వైదూర్య, బీఏ, పెద్దపల్లి

సైన్యాన్ని పటిష్టం చేయాలి



అత్యుత్తమ టెక్నాలజీ ఉన్న భారతదేశ సైన్యాన్ని చూసి ప్రపంచమే వణికిపోతోంది. యుద్ధ విమానాలు, ఇతర దాడులు చేసే క్షిపణుల వ్యవస్థను మరింత పటిష్టపరిచి శత్రుదేశాలు మన గురించి ఆలోచించాలంటే వణుకుపుట్టేలా భారత సైన్యాన్ని సిద్ధం చేయాలి.

– ఆర్.నీలిమ, కరీంనగర్

ఫీజులు తగ్గించాలి



విద్యలో, టెక్నాలజీలో మనదేశం అభివృద్ధి చెందాలి. వైద్యానికి, చదువుకు అయ్యే ఫీజులు తగ్గించాలి. పేద విద్యార్థులకు వైద్య కోర్సులు కలగానే మిగిలిపోతున్నాయి. ప్రభుత్వం విద్య, వైద్యం తప్ప మిగితా పథకాలకు ప్రాధాన్యం తగ్గించినా ఫర్వాలేదు.

కె.అలేఖ్య, బీఎస్సీ, మానకొండూర్

విద్యావంతులకే పట్టం కట్టాలి



2047నాటికి దేశం అగ్రస్థానంలో నిలవాలంటే రాజకీయాల్లోకి చదువుకున్నవారు రావాలి. ఐఏఎస్, ఐపీఎస్‌లను ఎలా ఎంపిక చేస్తున్నారో, రాజకీయాల్లోనూ అత్యుత్తమ వ్యక్తులను ఎంపిక చేయాలి. వారి చేతిలో డిజిటల్ ఇండియా ముందుకు సాగుతుంది.

– అబ్దుల్ రహమాన్, సీఎస్ఈ ఫైనలియర్, కిట్స్

డ్రగ్స్ భూతాన్ని తరిమేయాలి



ప్రస్తుతానికి దేశాన్ని పీడించే ప్రధాన సమస్యల్లో డ్రగ్స్ ఒకటి. ఎంత కంట్రోల్ చేసినా రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వం పోలీసు, ఇతర వ్యవస్థలు దృష్టి సారించి డ్రగ్స్, నిషేధిత మత్తు పదార్థాలపై లోతుగా విచారించాలి. డ్రగ్స్ కట్టడికి కృషి చేయాలి.

– ఎ.మహేశ్, బీఎస్సీ, కరీంనగర్

వైద్యరంగంలో మార్పుకావాలి



భారతదేశం 2047నాటికి ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలంటే ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి. వైద్యరంగంలో టెక్నాలజీలో విప్లవాత్మక మార్పులు వస్తే అందరం ఆరోగ్యంగా ఉండి దేశాన్ని అగ్రస్థానంలో నిలపొచ్చు. ఉచిత వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

– అభిలాష్, సివిల్ ఫైనలియర్, కిట్స్

చీకటి రోజు ఆగస్టు 14



మౌన ప్రదర్శనలో కృష్ణారెడ్డి, సునీల్‌రావు, రమేశ్, జయశ్రీ, లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, బీజేపీ శ్రేణులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: 1947 ఆగస్టు 14 దేశ చరిత్రలో చీకటి రోజని, దేశ విభజన గాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని, బ్రిటిష్ వలస పాలకుల దుర్నీతితో ప్రపంచంలోనే అతి పెద్ద హింసాత్మక, దారుణాలతో మత ప్రాతిపదికన పాకిస్తాన్ ఏర్పడిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆగస్టు 14 విభజన గాయాల స్మృతి దినాన్ని పురస్కరించుకుని పార్టీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుంచి బస్టాండ్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న అర్ధరాత్రి లభించిన భారత స్వాతంత్ర్యానికి సంబరాలు చేసుకోవాలో విభజన విషవలలో చిక్కిన అమాయక ప్రాణాలను చూసి దుఃఖించాలో తెలియని దుస్థితి అన్నారు. మాజీ మేయర్ సునీల్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, బత్తుల లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, నర్సింహరాజు, రాపర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

ఓట్ల చోరీని అడ్డుకోవాలి



కొవ్వొత్తుల ప్రదర్శనలో కవ్వంపల్లి, నరేందర్‌రెడ్డి, వి.నరేందర్‌రెడ్డి, సత్యప్రసన్న, తదితరులు

- డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి

కరీంనగర్ కార్పొరేషన్: ఎన్నికల కమిషన్‌తో కలిసి బీజేపీ చేస్తున్న ఓట్ల చోరీని అడ్డుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఓట్‌చోరీకి నిరసనగా గురువారం రాత్రి నగరంలో కాంగ్రెస్ ప్రదర్శన నిర్వహించింది. ఇందిరాచౌక్ నుంచి బస్‌స్టేషన్ వరకు కొవ్వొత్తులతో నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు స్వతంత్రంగా వ్యవహరించిన ఎన్నికల కమిషన్ ప్రస్తుతం మోదీ చేతిలో కీలుబొమ్మలా మారిందని విమర్శించారు. జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు సత్తు మల్లేశం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, నాయకులు వుట్కూరి నరేందర్‌రెడ్డి, కర్ర సత్యప్రసన్న,ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ వేగవంతం చేయండి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 563 కోసం భూ సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గురువారం భారత జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్ట్ సంచాలకుడు దుర్గాప్రసాద్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేశ్ బాబుతో భూసేకరణ సమస్యలపై సమావేశం నిర్వహించారు. భూ సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను గురించి చర్చించారు. ఇదివరకే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సేకరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి సహకరించేలా చూడాలని అన్నారు. భూసేకరణలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని భారత జాతీయ రహదారి సంస్థకు స్వాధీనం చేయాలని పలు సూచనలు చేశారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

వీణవంక(హుజూరాబాద్‌): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొండపాక గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పానుగంటి ప్రమీల(56) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుందని పోలీసులు తెలిపారు. పానుగంటి విజయ్‌కుమార్‌,ప్రమీల దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు, రెండు, మూడు రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇంటిలోని బాత్‌రూంలో ఇనుపరాడుకు చీరతో ఉరేసుకుంది. భర్త విజయ్‌కుమార్‌ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

తల్లి మందలించిందని..

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామంలో సంపంగి సంధ్య(25) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ కథనం ప్రకారం.. సంధ్య – రమేశ్‌ భార్యాభర్తలు. వీరికి కూతురు వర్షిత ఉంది. రామగుండం స్వస్థలం. అయితే, వృత్తి రీత్యా లారీ డ్రైవర్‌ అయిన రమేశ్‌.. తన అత్తగారిల్లు కటికెనపల్లిలో ఉంటూ పనిచేసుకుంటున్నాడు. అయితే, సంధ్య కూతురు బుధవారం ఇంటివద్ద అల్లరి చేస్తోంది. అల్లరి ఎందుకు చేస్తున్నావని కొడుతోంది. గమనించిన సంధ్య తల్లి మామిడి సత్తమ్మ.. పాపను ఎందుకు కొడుతున్నావని మందలించింది. క్షణికావేశానికి లోనైన సంధ్య తీవ్రమనస్తాపం చెందింది. తన పత్తి చేనులోకి వెళ్లి గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రైళ్ల హాల్టింగ్‌ పునరుద్ధరణ



రామగుండం రైల్వేస్టేషన్‌

రామగుండం: పెద్దపల్లి, రామగుండం రైల్వేస్టేషన్లలో గతంలో రద్దు చేసిన పలు ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల హాల్టింగ్‌ను ఈనెల 15న పునరుద్ధరించనున్నట్లు ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం అధ్యక్షుడు కంకటి ఫణి గురువారం తెలిపారు. ఐఆర్‌సీటీసీ రైల్వే పోర్టల్‌లోపై వాటి రాకపోకలు, హాల్టింగ్‌ మార్పును అప్‌డేట్‌ చేయనున్నట్లు వెల్లడించారు.

హాల్టింగ్‌ పునరుద్ధరణ ఇలా..

రైలు నంబరు : 12656 : చెన్నై సెంట్రల్‌–అసర్వ జంక్షన్‌ (నవజీవన్‌ సూపర్‌ఫాస్ట్‌): పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 8.59 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో(12655) సాయంత్రం 4.45గంటలకు చేరుకుంటుంది.

రైలు నంబరు : 22737 : సికింద్రాబాద్‌–హిస్సార్‌ (హిస్సార్‌ సూపర్‌ఫాస్ట్‌): ప్రతీ మంగళ, బుధవారాల్లో పెద్దపల్లి జంక్షన్‌కు వేకువజామున 2.34గంటలకు చేరుకుంటుంది. దీనికి ఈనెల 19 నుంచి హాల్టింగ్‌ ఉంటుంది.

రైలు నంబరు : 17005 : హైదరాబాద్‌–రక్సోల్‌ (రక్సోల్‌ సూపర్‌ఫాస్ట్‌): ప్రతీ గురువారం వేకువజామున 2.34గంటలకు పెద్దపల్లి జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈనెల 21 నుంచి పెద్దపల్లి జంక్షన్‌లో హాల్టింగ్‌ ఉంటుంది.

రైలు నంబరు : 17006 : రక్సోల్‌ –హైదరాబాద్‌ (రక్సోల్‌ సూపర్‌ఫాస్ట్‌): ప్రతీ ఆదివారం రాత్రి 11.59గంటలకు పెద్దపల్లి జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈనెల 17 నుంచి హాల్టింగ్‌ ఉంటుంది.

రైలు నంబరు : 12295 : బెంగళూరు–దానాపూర్‌ (సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్‌): ప్రతీరోజు వేకువజామున 2.09గంటలకు రామగుండం రైల్వేస్టేషన్‌ చేరుకుంటుంది. శుక్రవారం నుంచి హాల్టింగ్‌ ఉంటుంది.

చిల్లపల్లి కార్యదర్శికి సన్మానం

- నేడు ఎర్రకోటలో పంద్రాగస్టు వేడుకలకు హాజరు


మంత్రితో సన్మానం పొందుతున్న కార్యదర్శులు

మంథనిరూరల్‌: గతేడాది జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంకిశోర్‌ను భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ, పంచాయతీరాజ్‌ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌ మంత్రి సన్మానించారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో చిల్లపల్లి సెక్రటరీతోపాటు రాష్ట్రంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన మరో ఐదుగురు కార్యదర్శులను సత్కరించారు. ఆరుగురు కార్యదర్శులతోపాటు పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆగస్టు 15న న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు.

క్రెడిట్‌ కార్డుల కమీషన్‌ పేరుతో డబ్బులు స్వాహా..

- నిందితుడి అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్‌ శివకుమార్‌



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్‌ శివకుమార్‌

వరంగల్‌ క్రైం: క్రెడిట్‌ కార్డుల ద్వారా కమీషన్‌ తీసుకోకుండా డబ్బులు ఇస్తానంటూ బాధితుల నుంచి లక్షలు స్వాహా చేసిన నిందితుడిని అరెస్ట్‌ చేసినట్లు హనుకొండ ఇన్‌స్పెక్టర్‌ ఎం.శివకుమార్‌ తెలిపారు. ఈ మేరకు బుధవారం పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్‌ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన నేరెళ్ల అరుణ్‌ 2023లో హనుమకొండ రాయపురలో 'భద్రకాళి డిజిటల్‌ సేవ' పేరుతో షాపు ఏర్పాటు చేశాడు. ఆన్‌లైన్‌ అప్లికేషన్స్‌తోపాటు కస్టమర్ల క్రెడిట్‌ కార్డు స్వైప్‌ చేసి వారికి డబ్బులు ఇచ్చేవాడు. రెగ్యులర్‌ కస్టమర్లను తన వాలెట్‌లో యాడ్‌ చేసుకుని వారి క్రెడిట్‌ కార్డుల్లో బ్యాలెన్స్‌ ఉంటే ఫోన్‌ చేసేవాడు. తాను వేరే పేమెంట్‌ చేసేది ఉందని చెప్పి వారి కార్డులు స్వైప్‌ చేసి వారికి ఎలాంటి చార్జీలు లేకుండా తానే క్రెడిట్‌ కార్డుల బిల్లులు చెల్లిస్తానని మోసం చేసేవాడు. కార్డులు స్వైప్‌ చేసిన తర్వాత వేరే కస్టమర్ల కార్డులు పేమెంట్‌ చేసి దానికి 4 శాతం వరకు చార్జీ తీసుకుని లాభం పొందేవాడు. ఎలాంటి కమీషన్‌ లేకుండా డబ్బులు డ్రా చేసి ఇస్తానని నమ్మించి డబ్బులు వాడుకున్న అనంతరం కొన్ని రోజుల తర్వాత ఇతరుల క్రెడిట్‌ కార్డు బిల్లులు చెల్లించేవాడు. సంవత్సరంన్నర పాటు కస్టమర్లకు నమ్మకంగా ఉంటూ వారి క్రెడిట్‌ కార్డు బిల్లులు చెల్లిస్తూ, క్రెడిట్‌ కార్డులు స్వైప్‌ చేస్తూ బాధితుల డబ్బుల నుంచి తన క్రాప్‌ లోన్‌, అప్పులు కట్టుకున్నాడు. ఇలా రూ.28 లక్షలు వాడుకున్నాడు. కొద్ది రోజులుగా విజయవాడలో ఉంటున్న నిందితుడు బుధవారం షాపు ఖాళీ చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించగా అరెస్ట్‌ చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

లారీ, బైక్‌ ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

మంథని: మున్సిపల్‌ పరిధిలోని గంగాపురి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో పెద్దపల్లి మండలం కనగర్తికి చెందిన చెట్టం వెంకటేశ్‌(30) మృతి చెందాడు. మంథని మండలం ధర్మారం గ్రామానికి చెందిన తిప్పని అభిలాష్‌ తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటేశ్‌, అభిలాష్‌ ఒక కార్యక్రమానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై పెద్దపల్లి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన అభిలాష్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

చొప్పదండి: మండలంలోని దేశాయిపేటకు చెందిన ఎలకపల్లి అంజయ్య సౌది అరేబియాలో మృతి చెందగా గురువారం మృతదేహం స్వగ్రామం చేరుకుంది. ఉపాధి కోసం గల్ఫ్‌ వెళ్లిన అంజయ్య అక్కడ మృతి చెందగా కుటుంబ సభ్యులు గల్ఫ్‌ జేఏసీని సంప్రదించారు. వారి కృషితో ఎట్టకేలకు మృతదేహం స్వగ్రామానికి చేరుకుందని గ్రామస్తులు తెలిపా రు. అంజయ్య కుటుంబానికి రూ.ఐదులక్షల ఎక్స్‌గ్రేషియా వచ్చేలా చూడాలని, మృతదేహం దేశాయిపేటకు రావడానికి 22 రోజుల సమయం పట్టిందని, ఇటువంటి ఇబ్బందులు రాకుండా రూ.ఐదువందల కోట్లతో గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గల్ఫ్‌ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కాంత ప్రభుత్వాన్ని కోరారు.

సేవలకు దక్కిన గౌరవం

- ఇండియన్‌ పోలీస్‌ మెడల్‌కు ఇద్దరు ఏఎస్సైలు


రాజేశుని శ్రీనివాస్‌


రుద్ర కృష్ణకుమార్‌

జగిత్యాలక్రైం/మల్యాల: విధి నిర్వహణలో వారు ఎప్పుడూ ముందున్నారు. తమ సర్వీసులో ఏనాడూ మచ్చ కూడా ఎరగరు. వారి సేవలను గుర్తించిన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనేక పతకాలు అందించింది. తాజాగా ప్రతిష్టాత్మకమైన ఇండియన్‌ పోలీస్‌ మెడల్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. జగిత్యాల స్పెషల్‌ బ్రాంచ్‌ ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్‌, మల్యాల పోలీస్‌స్టేషన్‌ ఏఎస్సై రుద్ర కృష్ణకుమార్‌కు మెడల్‌ ప్రకటించింది. రాజేశుని శ్రీనివాస్‌ 1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. 2012లో హెడ్‌ కానిస్టేబుల్‌గా, 2019లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2012లో రాష్ట్ర పోలీసు సేవా పథకం, 2019లో ఉత్తమ సేవా పథకం అందుకున్నారు. 36ఏళ్లుగా పోలీస్‌ పోలీసు శాఖకు చేస్తున్న సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఇండియన్‌ పోలీస్‌ మెడల్‌కు ఎంపిక చేసింది. అలాగే రుద్ర కృష్ణ కుమార్‌ 1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. 2017లో హెడ్‌కానిస్టేబుల్‌గా.. 2021లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2022లో రాష్ట్ర పోలీసు సేవా పథకానికి ఎంపికయ్యారు. 36 ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి ఇండియన్‌ పోలీస్‌ మెడల్‌కు ఎంపిక చేశారు. ఇద్దరిని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్‌ అభినందించారు. కష్టపడి పనిచేసే పోలీస్‌ అధికారులకు గుర్తింపు వస్తుందని తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

లీడింగ్‌ ఫైర్‌ ఆఫీసర్‌ వహిదుల్లాఖాన్‌కు రాష్ట్రపతి పతకం


వహిదుల్లాఖాన్‌

మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఫైర్‌ స్టేషన్‌లో లీడింగ్‌ ఫైర్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వహిదుల్లాఖాన్‌ అత్యున్నత పురస్కారమైన రాష్ట్రపతి పతకానికి ఎంపికయ్యారు. 1986లో ఫైర్‌మెన్‌గా అగ్ని మాపక శాఖలో చేరిన ఆయన.. ఆసిఫాబాద్‌, ఇచ్చోడ, ఆదిలాబాద్‌, పెద్దపల్లి, కరీంనగర్‌లో పని చేసి.. రెండేళ్ల క్రితం మెట్‌పల్లికి బదిలీపై వచ్చారు. 2015లో లీడింగ్‌ ఫైర్‌మెన్‌గా పదోన్నతి పొందారు. మొదటి నుంచి అంకితభావంతో పనిచేసే ఆయన విపత్తుల సమయాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారనే పేరు సంపాదించారు. అత ని సేవలకు గుర్తింపుగా ఇప్పటివరకు ఆరు ప్రశంసపత్రాలు, ఒక సేవాపతకం ప్రదానం చేశారు. ప్రస్తుతం రాష్ట్రపతి పతకానికి ఎంపిక కావడంపై ఆయనను ఉన్నతాధికారులు అభినందించారు.

జమ్మికుంట ఫైర్‌ అధికారి గోపాల్‌రెడ్డికి..


గోపాల్‌రెడ్డి

జమ్మికుంట: జమ్మికుంట పట్టణ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్‌ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బీరెడ్డి గోపాల్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఫైర్‌మెన్‌గా విధుల్లో అత్యంత ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఫైర్‌ ఆఫీసర్‌గా విధుల్లో క్రమ శిక్షణ, నిబద్ధతతో పని చేసినందుకు అవార్డుకు ఎంపికైనట్లు గోపాల్‌ రెడ్డి తెలిపారు.

రూ.1,947కే ఆరోగ్య పరీక్షలు

- 'మెడికవర్‌'లో వందేమాతరం హెల్త్‌ చెకప్‌ ప్యాకేజీ




మాట్లాడుతున్న గుర్రం కిరణ్‌

కరీంనగర్‌టౌన్‌: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని మెడికవర్‌ ఆస్పత్రి యాజమాన్యం ప్రత్యేక హెల్త్‌ చెకప్‌ ప్యాకేజీ ప్రవేశ పెట్టిందని ఆస్పత్రి సెంటర్‌ హెడ్‌ గుర్రం కిరణ్‌ తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేమాతరం హెల్త్‌ చెకప్‌ ప్యాకేజీ పేరిట అందుబాటులోకి తీసుకొచ్చిన పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలను రూ.1,947 చెల్లించి పొందవచ్చన్నారు. కార్డియాలజీ, జనరల్‌ ఫిజీషియన్‌, డైటీషియన్‌ కన్సల్టేషన్‌తో పాటు కంప్లీట్‌ బ్లడ్‌ పిక్చర్‌ (సీబీపీ), కంప్లీట్‌ యూరిన్‌ ఎగ్జామినేషన్‌(సీయూఈ), ఫాస్టింగ్‌ బ్లడ్‌ షుగర్‌, లిపిడ్‌ ప్రొఫైల్‌, లివర్‌ ఫంక్షన్‌ టెస్ట్‌(ఎల్‌ఎఫ్‌టీ), ఎక్స్‌రే చెస్ట్‌ (విత్‌అవుట్‌ ఫిలిం), ఈసీజీ, 2డీ ఎకో, హెపటైటిస్‌బీఏ1సి, సీరం యూరియా, అల్ట్రాసౌండ్‌ స్కానింగ్‌ (అబ్డొమెన్‌- పెల్విస్‌), సీరం క్రియాటినిన్‌ పరీక్షలు ఈ ప్యాకేజీ ద్వారా నిర్వహిస్తామని వివరించారు. ఈ ప్యాకేజీ సెప్టెంబర్‌ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గుండుసూదిపై జాతీయ జెండాతో పరుగెడుతున్న యువతి

- సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్‌ అద్భుత సృష్టి


గుండు సూది మొనపై జాతీయ జెండాతో యువతి


చిత్ర రూపకర్త గుర్రం దయాకర్‌

జగిత్యాలటౌన్‌: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్‌ గుండుసూది మొనపై జాతీయ జెండాతో పరుగెడుతున్న యువతి చిత్రాన్ని రూపొందించి ఔరా అనిపించాడు. పండుగలు, పబ్బాలు, జాతీయ పండుగలు వంటి ప్రత్యేక సందర్భంలో ఏదో సూక్ష్మరూప చిత్రం ద్వారా సమాజానికి సందేశం పంపించే దయాకర్‌.. ఈ స్వాతంత్ర్య వేడుకకు జాతీయ జెండాతో పరుగులు పెడుతున్న యువతి సూక్ష్మకళాకండాన్ని రూపొందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందు వరుసలో నిలుస్తున్నారన్న సందేశాన్ని సమాజానికి అందించడమే ఈ చిత్ర ఉద్దేశమని దయాకర్‌ తెలిపారు. ఈ సూక్ష్మ కళారూపాన్ని తయారు చేసేందుకు మైనం పెన్సిల్‌ కలర్స్‌ ఉపయోగించానని, పది గంటల సమయం పట్టినట్టు తెలిపారు.

పంద్రాగస్టుకు పోదువు.. లే కొడుకా

- పాఠశాలకు వెళ్లొస్తుండగా అదుపుతప్పిన ఆటో
- నాలుగేళ్ల బాలుడి దుర్మరణం.. నలుగురికి తీవ్రగాయాలు
- రెండు నిమిషాల్లో ఇంటికి చేరే క్రమంలో ప్రమాదం
- కరీంనగర్‌ జిల్లా మన్నెంపల్లి శివారులో ఘటన


నాంపల్లి హర్షవర్ధన్‌ మృతదేహం


హర్షవర్ధన్‌ (ఫైల్‌)

తిమ్మాపూర్‌: ఉదయం అందరితో కలిసి సంతోషంగా బడికి వెళ్లాడు. తెల్లవారితే పంద్రాగస్టు కావడంతో ఆ వేడుకల గురించే తోటి పిల్లలతో మాట్లాడుకుంటూ ఇంటికి ఆటోలో బయల్దేరాడు. కానీ, ఆ బాలుడి ఆనందం మార్గంమధ్యలోనే ఆవిరైంది. ఆటో ప్రమాదం అనంతలోకాలకు తీసుకెళ్లింది. 'పంద్రాగస్టుకు పోదువు లే.. కొడుకా' అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు స్థానికులను కన్నీరు పెట్టించింది. ఈ విషాద ఘటన కరీంనగర్‌ జిల్లా తిమ్మాపూర్‌ మండలం మన్నెంపల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. తిమ్మాపూర్‌లోని ఓ ప్రైవేట్‌ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులతో స్కూల్‌ నుంచి ఆటో మన్నెంపల్లికి బయల్దేరింది. గ్రామానికి 500వీటర్ల దూరంలో కుక్కలు ఆటో వెంట పరుగెత్తడంతో డ్రైవర్‌ ఒక్కసారిగా బ్రేక్‌ వేశాడు. ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. 15మంది చిన్నారుల్లో నలుగురుకి తీవ్ర గాయాలు, మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. మన్నెంపల్లికి చెందిన 4వ తరగతి విద్యార్థి నాంపల్లి హర్షవర్ధన్‌ (9) తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో ఎడమవైపు కూర్చున్న హర్షవర్ధన్‌పై ఆటో బరువుపడడంతోపాటు, పగిలిన ఆటో అద్దాలు అతని తలలో గుచ్చుకున్నాయి. అతని ఎడమ చేయి కూడా తీవ్రంగా దెబ్బతిని నుజ్జునుజ్జుగా మారింది. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, గాయాల తీవ్రతతో హర్షవర్ధన్‌ మృతి చెందాడు. అదే ఆటోలో హర్షవర్ధన్‌ అక్క నాంపల్లి శ్రీసాహితి కూడా ఉంది. తమ్ముడు కళ్లముందే తీవ్రంగా గాయపడడం చూసి బోరున విలపించింది. హర్షవర్ధన్‌ తల్లిదండ్రులు నాంపల్లి శ్రీనివాస్‌, సమతలు వ్యవసాయం చేస్తూ, కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. ఈ దుర్ఘటన వారి కుటుంబాన్ని తీవ్ర శోకంలో ముంచెత్తింది. శ్రీనివాస్‌ ఫిర్యాదుతో ఆటో డ్రైవర్‌ అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

విషజ్వరంతో ఒకరి మృతి

సారంగాపూర్‌: మండల కేంద్రానికి చెందిన మోతుకు గంగమల్లు (55) విషజ్వరంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. గంగమల్లు రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బంధువులు జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.